సాక్షి
విశాఖపట్నం
బుధవారం, 16, ఏప్రిల్, 2025



మద్యం దుకాణం వద్దంటూ ఆందోళన చేస్తున్న మహిళలు

మద్యం దుకాణాన్ని అడ్డుకున్న మహిళలు

- సాయంత్రం వరకు కొనసాగిన నిరసన
- ఎట్టకేలకు వెనుదిరిగిన నిర్వాహకులు

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు వెలంపేట వద్ద మద్యం దుకాణం ఏర్పాటును మంగళవారం స్థానిక మహిళలు అడ్డుకున్నారు. ఆలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయకూడదంటూ నినదించారు. జనావాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటుకు అధికారులు ఎలా అనుమతులు ఇచ్చారని ప్రశ్నించారు. ఇళ్ల మధ్యలో దుకాణాలు పెడితే మహిళలకు ఎలా రక్షణ ఉంటుందని నిలదీశారు. ఈ విషయమై మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు నిర్వాహకులు మహిళల మధ్య రభస కొనసాగింది. మహిళల పోరాటం వల్ల నిర్వాహకులు మద్యం దుకాణం ఏర్పాటు చేయకుండానే వెనుదిరిగారు.





మమ్మేలవమ్మా.. పోలమాంబ

అంగరంగ వైభవంగా అమ్మవారి జాతర





14 గ్రామాల ఆరాధ్యదైవం పెదవాల్తేరు కరకచెట్టు పోలమాంబ జాతర మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. పెదవాల్తేరు, చినవాల్తేరు, పెదజాలరిపేట, మద్దిలపాలెం, శివాజీపాలెం, నక్కవానిపాలెం, రేసపువానిపాలెం, పీతలవానిపాలెం, ముివ్వలవానిపాలెం, మూలపాలెం, వాసవాని పాలెం, జాలరి ఎండాడ, జోడుగుళ్లపాలెం, పెదగదిలి, చినగదిలి తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి.. అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. ఆయా ప్రాంతాల్లో పండగ వాతావరణం నెలకొంది. ప్రధాన కూడళ్లు, రహదారులు విద్యుత్ దీపాలతో ధగధగలాడాయి. స్థానిక ప్రజా ప్రతినిధులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పరిసరాల్లో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. - బీచ్‌రోడ్డు

న్యూస్‌రీల్

చర్చలు సఫలం

స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె విరమణ



ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నుంచి తలపెట్టిన నిరవధిక సమ్మెను విరమించారు. కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపును ఆపాలని, ఇప్పటికే తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, 45 ఏళ్లు పై బడిన కార్మికులకు వైద్య పరీక్షలు విరమించాలన డిమాండ్లపై కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు సమ్మె చేయాలని నిర్ణయించాయి. ఆఖరి ప్రయత్నంగా ఈ డిమాండ్లపై మంగళవారం రాత్రి వరకు రీజనల్ లేబర్ కమిషనర్ సమక్షంలో కార్మిక సంఘాలు, యాజమాన్యం మధ్య చర్చలు జరిగాయి. తొలగించాల్సిన జాబితాను మే 20 వరకు వాయిదా వేయాలని, ఈలోగా రాజకీయ నిర్ణయం తీసుకునేలా తాము ప్రయత్నిస్తామని కార్మిక నాయకులు కోరారు. ఇంతవరకు తొలగించిన 1,500 మందిలో దీర్ఘకాలికంగా సక్రమంగా విధులు నిర్వహించని వారు మినహా మిగిలిన వారిని విధుల్లోకి తీసుకునే అంశంపై కార్మిక సంఘాలతో చర్చిస్తామని యాజమాన్యం హామీ ఇచ్చిందని నాయకులు తెలిపారు. దీంతో సమ్మె విరమించినట్లు నాయకులు తెలిపారు.

జోన్-1 కమిషనర్‌గా అయ్యప్పనాయుడు

యూసీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా రత్నకుమార్

డాబాగార్డెన్స్: జోన్-1 కమిషనర్‌గా అయ్యప్పనాయుడు నియమితులయ్యారు. మున్సిపల్ కమిషనర్ గ్రేడ్-2 హోదాలో పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న టీటీ రత్నకుమార్‌ను జీవీఎంసీ యూసీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. అయ్యప్పనాయుడు ప్రస్తుతం రామచంద్రాపురం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. ప్రస్తుతం జోన్-1 కమిషనర్‌గా ఉన్న ప్రసన్నవాణిని కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు రిపోర్టు చేయమని పేర్కొన్నారు.

ఘనంగా జాతీయ అగ్నిమాపక సేవా దినోత్సవం



వీర ఫైర్‌మెన్ స్మారక చిహ్నం వద్ద నివాళులర్పిస్తున్న పోర్టు చైర్‌పర్సన్ అంగముత్తు

విశాఖ సిటీ: విశాఖ పోర్ట్ అథారిటీ ఆధ్వర్యంలో జాతీయ అగ్నిమాపక సేవా దినోత్సవాన్ని కేంద్ర అగ్నిమాపక స్టేషన్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పోర్టు చైర్‌పర్సన్ డాక్టర్ ఎం.అంగముత్తు పాల్గొని వీర ఫైర్‌మెన్ స్మారక స్థూపం వద్ద అంజలి ఘటించారు. ఫైర్ పరికరాలు, ఫొటో ప్రదర్శనలను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన ప్రమాదకర సరకు నిర్వహణలో తీసుకోవాల్సిన అగ్ని సుర్క్ష జాగ్రత్తలపై కరపత్రాలను విడుదల చేశారు. ఈ ఏడాది 'యునైట్ టు ఇగ్నైట్, ఏ ఫైర్ సేఫ్ ఇండియా' థీమ్‌తో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అగ్ని సుర్క్ష కార్యక్రమాల్లో పాల్గొన్న సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందించారు. ఫైర్ ఆఫీసర్ కె.కుమార్‌రాజు మాట్లాడుతూ గతేడాది పోర్టు పరిధిలో 5, నగరంలో 2 అగ్ని ప్రమాదాలు జరగగా తక్షణమే స్పందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్ దూబే, ముఖ్య విజిలెన్స్ అధికారి పీఎస్ఎల్ స్వామి, డిప్యూటీ కన్జర్వేటర్ కెప్టెన్ టి.శ్రీనివాస్, విభాగాధిపతులు పాల్గొన్నారు.

• రూటు మారుతోంది..

ఆడిట్ భవన్ ఔట్



విశాఖలోని సీజీఎస్టీ భవనం

- గుంటూరుకు తరలిపోనున్న సెంట్రల్ జీఎస్టీ ఆడిట్ భవన్
- విజయవాడలో ఆర్‌బీఐ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు
- విశాఖ నుంచి ఒక్కొక్కటిగా దూరం చేస్తున్న కూటమి ప్రభుత్వం

సాక్షి, విశాఖపట్నం: ఆర్థిక రాజధానిగా విశాఖను అభివృద్ధి చేస్తానంటూ దశాబ్దాలుగా బాకా కొట్టిన చంద్రబాబు.. ఇప్పుడు ఆ ప్రాంతంలో ఉన్న ప్రధాన కార్యాలయాల్ని తరలించేందుకు కుట్ర పన్నుతున్నారు. మొన్న విశాఖలో ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు ఆర్‌బీఐ సిద్ధం కాగా.. చివరి నిమిషంలో దాన్ని విజయవాడలో ఏర్పాటు చేసేలా ఒత్తిడి తీసుకొచ్చారు. తాజాగా సెంట్రల్ జీఎస్టీ ఆడిట్ భవనాన్ని కూడా వైజాగ్ నుంచి అమరావతికి కూటమి ప్రభుత్వం తరలించేస్తోంది. గుంటూరుకు ఆడిట్ భవనం ప్రధాన కార్యాలయం వెళ్లనుందని స్వయంగా అధికారులు ప్రకటించారు. ఇకపై అక్కడి నుంచి రాష్ట్ర వ్యాప్త కార్యకలాపాలు జరగనున్నాయి. ఏడాదిన్నర కాలంలో కొత్త ఆడిట్ భవనానికి షిఫ్ట్ అవ్వనున్నారు. ఎన్నికల ముందు విశాఖపై అలవిమాలిన ప్రేమ కురిపించిన చంద్రబాబు, పవన్.. ఇప్పుడు అన్ని రంగాల్నీ ఇక్కడ నుంచి దూరం చేసేందుకు కుట్ర పన్నుతున్నారనడానికి ఇదో ప్రత్యక్ష ఉదాహరణ.

ఇకపై గుంటూరు కేంద్రంగా కార్యకలాపాలు

ప్రస్తుతం జీఎస్టీ భవన్‌లోనే ఆడిట్ ప్రధాన కార్యాలయం నడుస్తోంది. కమిషనరేట్ ఆఫ్ సెంట్రల్ జీఎస్టీ ఆడిట్ కార్యాలయం పరిధిలో మొత్తం 5 సర్కిళ్లున్నాయి. విశాఖపట్నం సర్కిల్ పరిధిలో 6 ఆడిట్ గ్రూప్‌లు, కాకినాడ సర్కిల్‌లో 5, గుంటూరులో 6, నెల్లూరులో 4, తిరుపతిలో 4 గ్రూప్‌లు సేవలందిస్తున్నాయి. పదకొండేళ్లుగా.. వీటన్నింటి కార్యకలాపాలు ప్రధాన ఆడిట్ కమిషనరేట్ విశాఖ నుంచే పర్యవేక్షణ జరిగేది. బ్రిటిష్ కాలం నుంచి విశాఖలో కస్టమ్స్ హౌస్ ఉన్న నేపథ్యంలో.. ఇక్కడే కస్టమ్స్, కేంద్ర పన్నుల కార్యాలయాలు కొనసాగాయి. ఆడిట్ కమిషనరేట్‌ను గుంటూరు కమిషనరేట్ అని పిలిచినా.. ప్రధాన కార్యాలయం **మాత్రం వైజాగ్‌లోనే ఉంది.** అయితే.. తాజాగా **ఆడిట్ ప్రధాన కార్యాలయాన్ని** గుంటూరుకు తరలిస్తున్నారు. **బీఎస్ఎన్ఎల్‌కు** చెందిన 3 ఎకరాల **స్థలంలో ఈ కార్యాలయాన్ని** నిర్మిస్తున్నారు. సీజీఎస్టీ **ఆడిట్ కమిషనరేట్‌తో** పాటు అధికారుల **భవన సముదాయం, జిమ్నాజియం,** పార్కు, **కమ్యూనిటీ హాల్, ప్లే** గ్రౌండ్‌ని ఏర్పాటు **చేస్తున్నారు.**

విశాఖపై కుట్రలో భాగంగా

ఆంధ్రప్రదేశ్‌లో సెంట్రల్ జీఎస్టీ ప్రధాన కార్యాలయాలకు సంబంధించిన సమగ్ర కార్యకలాపాలు విశాఖపట్నం కేంద్రంగానే జరిగేవి. విశాఖపట్నం పోర్టు అథారిటీ, అంతర్జాతీయ విమానాశ్రయం, కంటైనర్ టెర్మినల్, స్టీల్‌ప్లాంట్, హెచ్‌పీసీఎల్, షిప్‌యార్డ్, డాక్‌యార్డ్.. ఇలా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ఇక్కడే ఉండటంతో.. సెంట్రల్ జీఎస్టీ కార్యకలాపాలకు వైజాగ్ కేంద్ర బిందువుగా ఉండేది. కానీ.. విశాఖను క్రమంగా నిర్వీర్యం చెయ్యాలనే కుట్రలో భాగంగా.. కూటమి ప్రభుత్వం.. ఇక్కడి నుంచి కీలక కార్యాలయాల్ని తరలించేందుకు యత్నిస్తోంది. తొలుత ఆర్‌బీఐ రీజనల్ కార్యాలయం ఇక్కడికి రాకుండా చేసిన ప్రభుత్వం.. ఇప్పుడు.. విశాఖలో ఉన్న సెంట్రల్ జీఎస్టీ ఆడిట్ భవనాన్ని గుంటూరు తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేసేశారు.

ఏడాదిన్నరలోగా కార్యాలయం ప్రారంభం



2 లక్షల యూనిట్లు ఉంటే.. 700 యూనిట్లు మాత్రమే చూడగలుగుతున్నాం. సిబ్బంది తక్కువగా ఉండటంతో అన్ని సర్కిళ్లలోనూ పని ఒత్తిడి తీవ్రంగా ఉంది. అందుకే ప్రధాన కార్యాలయంతో పాటు ఆధునిక వసతులతో కూడిన నివాస భవన సముదాయం ఏర్పాటు చేస్తున్నాం. సీపీడబ్ల్యూడీ ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయి. వీలైనంత త్వరగా ఇవ్వాలని కోరాం. విశాఖ నుంచి కమిషనరేట్‌ని గుంటూరు తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

– పి.ఆనంద్‌కుమార్, సీజీఎస్టీ ఆడిట్ కమిషనరేట్ కమిషనర్

వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించాల్సిందే..

- బీజేపీ ప్రభుత్వం హిందూ, ముస్లింల మధ్య చిచ్చుపెడుతోంది
- ఆవాజ్ రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురి ఆవేదన



రౌండ్‌టేబుల్ సమావేశంలో ఐక్యత చాటుతున్న ముస్లింలు

డాబాగార్డెన్స్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హిందూ, ముస్లింల మధ్య ఉన్న సోదర భావాన్ని దెబ్బతీసి, కుల మతాల పేరిట చిచ్చుపెడుతోందని ఆవాజ్ విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వక్ఫ్ చట్ట సవరణ–2025, పర్యవసానాలపై మంగళవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు ఆరోపించారు. హిందూ, ముస్లిం రాజులు ముస్లింల సంక్షేమానికి వందల ఏళ్ల కిందట ఇచ్చిన భూములపై ఈ ప్రభుత్వాల అరాచకమేంటని ప్రశ్నించారు.

ఆవాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.ఎ.అష్రఫ్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ముస్లిం మత పెద్దలు మున్నీర్, అహ్మద్‌ఖాన్, అబీదా బేగం, ఎదీన్, మున్నీషాతో పాటు సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ పలువురు ముస్లింలు మాట్లాడుతూ ఈ చట్టం రాజ్యాంగం కల్పించిన మైనార్టీల హక్కులపై దాడి చేస్తోందన్నారు. మతపరంగా చీలికలు పెంచుతున్న ఈ చట్టానికి వ్యతిరేకంగా నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

గతంలో ఉన్న వక్ఫ్ చట్టం వక్ఫ్ ఆస్తుల(ఇస్లామిక్ దానధర్మాలు) నిర్వహణకు సంబంధించి సక్రమ నిర్వహణ, రక్షణకు హామీ కల్పించిందన్నారు. సవరించిన చట్టంలో గణనీయ మార్పులు చోటు చేసుకున్నాయని, ఈ మార్పులు గత చట్టంలో పొందుపరచిని ప్రాథమిక సూత్రాలకు విఘాతం కలిగిస్తున్నట్లు ఆరోపించారు. ఈ సవరణ ద్వారా బీజేపీ ప్రభుత్వం ప్రజలను మతం పేరిట చీల్చి, తన హిందూత్వ ఎజెండాను ముందుకు తెస్తోందని మండిపడ్డారు. వక్ఫ్ ఆస్తుల నిర్వహణ నుంచి ముస్లిమేతరులను నిషేధించాలని ఇస్లామిక్ ఆదేశాలు ఉన్నప్పటికీ సవరించిన చట్టం వారిని వక్ఫ్‌బోర్డులో చేర్చిందన్నారు. వక్ఫ్ చట్టంలోని సెక్షన్ 40ను రద్దు చేయడంతో ఆస్తుల స్వభావాన్ని నిర్ణయించేందుకు గల అధికారాన్ని వక్ఫ్‌బోర్డు కోల్పోనుందన్నారు.

వక్ఫ్ ఆస్తుల నిర్ధారణ అధికారాన్ని సర్వే కమిషనర్ నుంచి ప్రభుత్వం నియమించిన రెవెన్యూ అధికారులకు బదిలీ చేయడం ద్వారా ఆరాధనా స్థలాలు, విద్యా సంస్థలు, ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు, వృత్తివిద్యా కేంద్రాలు స్వాధీనం చేసుకోవాలన్నదే ప్రభుత్వ లక్ష్యంగా ఉందని ఆరోపించారు. దేశ లౌకిక, ప్రజాతంత్ర కూర్పు పరిరక్షించేందుకు లౌకిక వాదులు, ప్రజాస్వామ్య భావజాలం గల పౌరులందరూ ఈ విచ్ఛిన్నకర వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించాలనే డిమాండ్‌తో ఒక్కతాటిపైకి రావాలని కోరారు.

కార్పొరేటర్ల కొనుగోలు నీతి బాహ్యం

- మేయర్, డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాస తీర్మానానికి సీపీఐ, సీపీఎం దూరం
- కూటమితో రాష్ట్రానికి నష్టం
- 19న జరిగే ఓటింగ్‌లో పాల్గొనడం లేదు
- కార్పొరేటర్లు ఎ.జె.స్టాలిన్, గంగారావు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

డాబాగార్డెన్స్: మేయర్, డిప్యూటీ మేయర్‌పై టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన కార్పొరేటర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం, సమావేశం, ఓటింగ్‌లో సీపీఐ, సీపీఎం కార్పొరేటర్లు ఏజే స్టాలిన్, డాక్టర్ బి. గంగారావు పాల్గొనడం లేదని ఆ పార్టీ జిల్లా కమిటీలు తెలిపాయి. ఈ మేరకు మంగళవారం జగదాంబ జంక్షన్ సమీపంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మరడాన జగ్గునాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు, ఇద్దరు కార్పొరేటర్లు మాట్లాడారు. టీడీపీ, జనసేన పార్టీలు బీజేపీతో కలిసి కూటమిగా కొనసాగడం రాష్ట్రానికి, ముఖ్యంగా జిల్లాకు తీవ్ర నష్టమన్నారు. కూటమిని అడ్డుపెట్టుకుని బీజేపీ ప్రశాంతతకు మారుపేరైన విశాఖ నగరంలో మత ఘర్షణలు సృష్టించడానికి ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. మేయర్‌పై అవిశ్వాస తీర్మానం సందర్భంగా నిసిగ్గుగా కార్పొరేటర్లు పార్టీలు మారడం దారుణమన్నారు. పార్టీ మారాలనుకునే వారు ముందుగా తమ పదవులకు రాజీనామా చేయాలన్నారు. ఒక పార్టీ జెండాపై గెలిచి.. మరో పార్టీలో చేరడానికా మిమ్మల్ని ప్రజలు ఎన్నుకున్నారని ప్రశ్నించారు. మీకు నిజంగా దమ్ము, ధైర్యం ఉంటే.. తిరిగి ఎన్నికల్లో నిలబడి మీ సత్తా ఏంటో నిరూపించుకోవాలన్నారు. లక్షల రూపాయలు ఇచ్చి కార్పొరేటర్లను కొనుగోలు చేయడం నీతి బాహ్యమైన చర్యగా భావిస్తున్నామన్నారు. ఇటువంటి విలువలు లేని పార్టీలు, పదవుల కోసం, డబ్బు కోసం, వారి వ్యాపారాల కోసం ఎంతకైనా దిగజారుతున్న కార్పొరేటర్లు నగరానికి ఏం మేలు చేస్తారన్నారు. ఈ విషయాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతున్న సీపీఎం, సీపీఐలు స్వార్థ మేయర్ రాజకీయ క్రీడలో పాల్గొనవని స్పష్టం చేశారు.

భూ క్రమబద్ధీకరణకు దరఖాస్తులు

మహారాణిపేట: పట్టణ భూగరిష్ట పరిమితి చట్టం (యూఎల్‌సీ) పరిధిలో మిగుల భూముల ఆక్రమణల క్రమబద్ధీకరణ కోసం సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.మయూర్ అశోక్ సూచించారు. 2019 మే 1కు ముందు నుంచి భూమి తమ ఆక్రమణలో ఉన్నట్టుగా రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్, నిర్మాణం మీద జీవీఎంసీ ప్లాన్, ఇంటి పన్ను రశీదు, కరెంటు బిల్, వాటర్ టాక్స్ నకళ్లతో తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేయాలన్నారు. ఈ ఏడాది డిసెంబర్ 31లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జీవో నిబంధనలకు లోబడి క్రమబద్ధీకరిస్తామన్నారు. 150 చ.గ.లోపు భూమిని ఉచితంగా, 151–300 చ.గ. వరకు ప్రస్తుత రిజిస్ట్రేషన్ బేసిక్ విలువలో 15 శాతం, 300–500 చ.గ.కు బేసిక్ విలువలో 30 శాతం, 500 చ.గ. పైబడిన వాటికి 100 శాతం లెక్కించి డీడీ లేదా బ్యాంక్ చెక్ జతచేయాలన్నారు. తొలుత జాయింట్ కలెక్టర్, కాంపిటెంటు అధికారి, పట్టణ భూగరిష్ట పరిమితి చట్టం, విశాఖపట్నం వారి పేరున డీడీ తీసి దరఖాస్తుతో జత పరిచి సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాల్సిందిగా సూచించారు.

న్యాయమూర్తులకు ఘన వీడ్కోలు



కేక్ కట్ చేస్తున్న పోక్సో కోర్టు న్యాయమూర్తి ఆనంది, చిత్రంలో న్యాయమూర్తి గోవర్ధన్

విశాఖ లీగల్: బదిలీపై వెళ్తున్న న్యాయమూర్తుల సేవలు మరువలేనని విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎం.కె.శ్రీనివాస్ అన్నారు. పోక్సో కోర్టు న్యాయమూర్తి జి.ఆనంది కాకినాడకు, 12వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి జి.గోవర్ధన్ కాకినాడలోని 6వ అదనపు జిల్లా న్యాయమూర్తులుగా బదిలీ అయ్యారు. వీరికి మంగళవారం పోక్సో కోర్టు ఆవరణలో పోక్సో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బత్తి రాజశేఖర్, న్యాయవాదుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో అభినందన సభ జరిగింది. కార్యక్రమంలో న్యాయవాద సంఘం అధ్యక్షుడు ఎం.కె. శ్రీనివాస్ మాట్లాడారు. 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి గోవర్ధన్, పోక్సో కోర్టు న్యాయమూర్తి ఆనంది అందించిన సేవలు మరపురానివన్నారు. అనంతరం కేక్ కట్ చేసి వారి సేవలను కొనియాడారు. న్యాయమూర్తి గోవర్ధన్ మాట్లాడుతూ న్యాయమూర్తిగా మా నాన్న అందించిన సేవలు తనకు ఎంతో స్ఫూర్తినిచ్చాయన్నారు. పోక్సో కోర్టు న్యాయమూర్తి జి.ఆనంది మాట్లాడుతూ విశాఖలో న్యాయమూర్తిగా పనిచేయడం మరపురాని అనుభూతిగా చెప్పారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్, డీఎస్పీ లతామాధురి, న్యాయవాదుల సంఘం కార్యదర్శి ఎల్.పార్వతీనాయుడు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు బి.రాజశేఖర్, బి.వి. ఆర్.మూర్తి, పోలీసు అధికారులు, న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

జిల్లా పర్యాటక అధికారిగా మాధవి

సాక్షి,విశాఖపట్నం: జిల్లా పర్యాటక అధికారిగా జల్లేపల్లి మాధవిని నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆమె జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈమెని మహిళా శిశు సంక్షేమ విభాగం నుంచి రిలీవ్ చేస్తూ డీటీవోగా నియమించారు. గతంలో ఇక్కడ జిల్లా పర్యాటక అధికారిగా పనిచేసిన కుంచె జ్ఞానవేణిని ఎన్‌హెచ్–16 ఎస్డీసీగా నియమిస్తూ జీవో విడుదల చేశారు.

చందనోత్సవంపై సమీక్ష నేడు

మహారాణిపేట: శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామి చందనోత్సవం ఏర్పాట్లపై దేవదాయ శాఖ, జిల్లా అధికారులతో జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. సమావేశానికి ఇన్‌చార్జి మంత్రితోపాటు దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తదితరులు హాజరు కానున్నారు.

నేడు జెడ్పీ సమావేశం

మహారాణిపేట: ఉమ్మడి విశాఖ జిల్లా ప్రజాపరిషత్ సర్వ సభ్య సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన జరగనుందని జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించే సర్వసభ్య సమావేశానికి జెడ్పీటీసీ సభ్యులు, ఆహ్వానితులు హాజరుకావాలని కోరారు. సమావేశానికి అన్ని శాఖల జిల్లా అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.



అనూష గర్భంలో ఆడబిడ్డ

- పోస్టుమార్టం అనంతరం దువ్వాడలో అంత్యక్రియలు
- నిందితుడు జ్ఞానేశ్వర్‌కు రిమాండ్


జ్ఞానేశ్వర్(ఫైల్)

మధురవాడ: భర్త చేతిలో హత్యకు గురైన గర్భిణీ అనూష మృతదేహానికి కేజీహెచ్‌లో వైద్యులు మంగళవారం పోస్టుమార్టం పూర్తి చేశారు. ఆమె నిండు గర్భిణి కావడంతో కడుపులోని శిశువు కూడా మరణించింది. గర్భం నుంచి ఆడ మృత శిశువును బయటకు తీశారు. ఇరువురినీ చూసి కుటుంబసభ్యులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. అమ్మ తోటే వెళ్లిపోతున్నావా తల్లీ అంటూ గుండెలవిసేలా రోదించారు. అనూష తండ్రి ఇది వరకే చనిపోగా.. తల్లి అంధురాలు కావడం మరింత ఆవేదనకు గురి చేసింది. ప్రత్యక్షంగా భార్యను, పరోక్షంగా తల్లి కడుపులో బిడ్డను హత్య చేసిన నిందితుడు గెద్దాడ జ్ఞానేశ్వర్‌ను కఠినంగా శిక్షించాలని ఆమె కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. అనూష అంత్యక్రియలను దువ్వాడలో పూర్తి చేశారు. కాగా.. దువ్వాడకు చెందిన జ్ఞానేశ్వర్ నర్సీపట్నం రోడ్డులోని అడ్డురోడ్డు తిమ్మాపురానికి చెందిన కేదారిశెట్టి అనూష (27)ని ప్రేమించాడు. 2023లో సింహాచలంలో పెళ్లి చేసుకున్నాడు. భార్యాభర్తలు ఏడాది నుంచి మధురవాడ మిథిలాపురి వుడాకాలనీ ఆర్టీసీ డిపో సమీపం లలితా విహార్ అపార్ట్‌మెంట్‌లోని 303వ నంబర్ ఫ్లాట్‌లో నివాసం ఉంటున్నారు. మనస్పర్థలు కారణంగా వారి మధ్య గొడవలు జరుగుతు న్నాయి. ఏడాది కాలంగా ఆమె అడ్డు తొలగించుకునేందుకు రకరకాలుగా ప్రయత్నిస్తున్నాడు. పిల్లలు పుడితే ఆమెను వదిలించుకోవడం మరింత కష్టమని భావించి.. హత్యకు పథకం వేశాడు. సోమవారం తెల్లవారుజామున ఆమె పీక నులిమి కిరాతకంగా చంపేశాడు. భార్యతో పాటు కడుపులో ఉన్న బిడ్డను కూడా హత్య చేసినందుకు పోలీసులు జ్ఞానేశ్వర్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. నిందితుడిని భీమిలి కోర్టులో హాజరు పరచగా.. మెజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించారు. దీంతో నిందితుడిని సెంట్రల్ జైలుకు తరలించినట్టు సీఐ బాలకృష్ణ తెలిపారు.

చంద్రబాబు హిందువులకు క్షమాపణ చెప్పాలి

- టీటీడీలో గోవుల మరణాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలి
- జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు డిమాండ్

మధురవాడ: తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ)లో గోవుల మరణాలపై వాస్తవాలను దాచిపెట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు హిందువులకు వెంటనే క్షమాపణ చెప్పాలని జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ ఎస్.ఎల్.ఎన్. వాసు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. టీటీడీ గోశాలలో చనిపోయిన గోవుల ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుంటే.. సీఎం చంద్రబాబు మాత్రం గోవులు చనిపోలేదని చెప్పి కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. స్వయంగా టీటీడీ చైర్మన్, ఈవో, తిరుపతి ఎమ్మెల్యే సైతం గోవులు మరణించిన విషయాన్ని ధ్రువీకరించారని ఆయన గుర్తు చేశారు. చనిపోయిన గోవుల సంఖ్య విషయంలో టీటీడీ చైర్మన్, ఈవో, తిరుపతి ఎమ్మెల్యే పొంతన లేని లెక్కలు చెప్పడం చూస్తుంటే.. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇంకా ఎన్ని గోవులు మరణించాయో అనే అనుమానాలు హిందువుల్లో కలుగుతున్నాయ న్నారు. గోవుల మరణాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీటీడీ అధికారుల నిర్లక్ష్యం వల్లే గోశాలలో ఆవులు ఆకలితో మరణిస్తున్నాయనే వాస్తవాన్ని వెలుగులోకి తెచ్చి, హిందూ సమాజాన్ని జాగృతం చేసిన టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిపై ప్రస్తుత ప్రభుత్వం పోలీసులకు ఫిర్యాదు చేయడం సరికాదన్నారు. గోవిందుడికి అత్యంత ప్రీతికరమైన గో సేవను నిర్లక్ష్యం చేయడం వల్లే గోవులు మరణిస్తున్నాయని, దీనికి బాధ్యులైన టీటీడీ చైర్మన్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలన్నారు. ఆయనపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని వాసు డిమాండ్ చేశారు.

జాతీయ బాలల పురస్కారాలకు దరఖాస్తులు

ఎంవీపీకాలనీ: జాతీయ ప్రధాన్ మంత్రి రాష్ట్రీయ్ బాల్ పురస్కారాల కోసం కేంద్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తోందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం తెలిపారు. సామాజిక సేవ, సాంకేతిక పరిజ్ఞానం, క్రీడలు, కళలు, సంగీతం, నృత్యం, పెయింటింగ్, నూతన ఆవిష్కరణలు, నాయకత్వ లక్షణాలు, నైపుణ్యం, ధైర్యసాహసాలు అంశాల్లో ప్రతిభ కనబరిచిన 5 నుంచి 18 ఏళ్లలోపు (జూలై, 2025 నాటికి) వారు అర్హులన్నారు. http:/awards.gov.in ద్వారా జూలై 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.130
స్కిన్	: రూ.230
స్కిన్‌లెస్	: రూ.240

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	425.00
విజయనగరం	429.00
శ్రీకాకుళం	429.00


కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

పక్కా ఉపాధికి పాలిటెక్నిక్

- 'పది'తోనే ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశం
- ఉమ్మడి విశాఖలో 8 ప్రభుత్వ కళాశాలలు
- 17వ తేదీ వరకు దరఖాస్తు గడువు పొడిగింపు

మురళీనగర్: పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశించడానికి పాలిటెక్నిక్ ఒక ముఖ్యమైన మార్గం. విద్యార్థులు మూడు లేదా మూడున్నరేళ్లలో డిప్లమో స్థాయి కోర్సులను పూర్తి చేసి, వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, కంపెనీల్లో సూపర్‌వైజర్ స్థాయి ఉద్యోగాలు పొందవచ్చు. అంతే కాకుండా ఇంజినీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఈసెట్) ద్వారా నేరుగా బీటెక్ సెకండియర్‌లో ప్రవేశించవచ్చు. డిప్లమో స్థాయిలో పొందిన ప్రాక్టికల్ నైపుణ్యాలతో సొంతంగా ఒక పరిశ్రమను స్థాపించి, 10 మందికి ఉపాధి కల్పించవచ్చు. విశాఖ ఉమ్మడి జిల్లాలో మొత్తం 8 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. కంచరపాలెంలో ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్), ప్రభుత్వ పాలిటెక్నిక్, పెందుర్తిలో ప్రభుత్వ పాలిటెక్నిక్, భీమిలిలో మహిళా పాలిటెక్నిక్, నర్సీపట్నం, అనకాపల్లి, చోడవరంలో పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. పాడేరులో ప్రభుత్వ మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కళాశాల ఉంది. వీటితో పాటు 19 ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి.


బృంద చర్చల్లో పాల్గొన్న పాలిటెక్నిక్ విద్యార్థులు

అందుబాటులో ఉన్న బ్రాంచ్‌లు

పాలిటెక్నిక్‌లో 36 కంటే ఎక్కువ బ్రాంచ్‌లు ఉన్నాయి. వాటిలో కెమికల్ ఇంజినీరింగ్, సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్, మెటలర్జీ వంటివి ముఖ్యమైన బ్రాంచ్‌లుగా చెప్పవచ్చు. ప్రతి బ్రాంచ్‌లో 60 సీట్లు ఉన్నాయి. ఇవన్నీ మంచి డిమాండ్ ఉన్న కోర్సులే. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో మెకానికల్ మూడు సెక్షన్లు, ఈఈఈ రెండు సెక్షన్లు, సివిల్ రెండు సెక్షన్లు, మెటలర్జీ ఒక సెక్షన్ ఉన్నాయి. మెటలర్జీ కోర్సు కంచరపాలెం, విజయనగరం, విజయవాడ ప్రభుత్వ కళాశాలల్లో అందుబాటులో ఉంది. నర్సీపట్నంలో మైనింగ్ కోర్సు ఉంది. కంచరపాలెం పాలిటెక్నిక్, కెమికల్ ఇంజినీరింగ్, అనకాపల్లి కళాశాలలు ఎన్‌బీఏ గుర్తింపు పొందాయి.


రూ.9.02 లక్షల వార్షిక ప్యాకేజీ పొందిన విద్యార్థులను అభినందిస్తున్న పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు(ఫైల్)

30న ప్రవేశ పరీక్ష

పాలిసెట్ దరఖాస్తు గడువును పొడిగిస్తూ రాష్ట్ర సాంకేతిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వాస్తవానికి పాలిసెట్ దరఖాస్తుకు మంగళవారంతో గడువు ముగిసింది. తల్లిదండ్రులు, విద్యార్థుల వినతి మేరకు ఈ నెల 17వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు గడువు పొడిగించారు. కాగా.. ఈ నెల 30న ఉదయం 11 నుంచి 1 గంట వరకు ప్రవేశ పరీక్ష జరగనుంది.

పారిశ్రామిక శిక్షణ

డిప్లమో విద్యలో భాగంగా క్షేత్ర పరిశీలన, ప్రయోగాత్మక అనుభవం కోసం ఆరు నెలల పాటు పారిశ్రామిక శిక్షణ ఉంటుంది. ఈ శిక్షణ సమయంలో కంపెనీలు నెలకు రూ. 3 వేల నుంచి రూ. 5 వేల వరకు స్టైఫండ్‌ను అందిస్తాయి. కెమికల్ ఇంజినీరింగ్, మెటలర్జీ వంటి శాండ్‌విచ్ కోర్సులు (మూడున్నరేళ్ల కాలవ్యవధి) అభ్యసిస్తున్న విద్యార్థులకు ఏడాది పాటు రెండు విడతలుగా పారిశ్రామిక శిక్షణ ఉంటుంది. వీరికి బోర్డ్ ఆఫ్ అప్రెంటిస్‌షిప్ అండ్ ట్రైనింగ్ నెలకు రూ.7వేల ఉపకార వేతనం అందిస్తుంది.


శిక్షణ పొందుతున్న విద్యార్థులు

ఉజ్వల భవిష్యత్



పాలిటెక్నిక్‌తో ఉజ్వల భవిష్యత్ ఉంటుంది. ఈ కోర్సులు చదివిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. తక్షణం ఉపాధి పొంది జీవితంలో స్థిరపడవచ్చు. 2024–25 సంవత్సరానికి 500 మందికి పైగా మంచి వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలు పొందారు. ముగ్గురు ఎలక్ట్రికల్ విభాగం విద్యార్థులు రూ.9.02 లక్షల అత్యధిక వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించి రికార్డు సృష్టించారు. హాస్టల్ సదుపాయం ఉంది. మంచి ర్యాంకులు సాధిస్తే ప్రభుత్వ కాలేజీల్లో సీట్లు పొందవచ్చు. పాలిసెట్‌కు ఉచిత కోచింగ్ ఇస్తున్నాం.

– డాక్టర్ కె.నారాయణరావు, ప్రిన్సిపాల్, కంచరపాలెం పాలిటెక్నిక్

కెమికల్ ఇంజినీరింగ్‌లో విస్తృత అవకాశాలు



రాష్ట్రంలో నాలుగు కెమికల్ ఇంజినీరింగ్ బ్రాంచ్‌లు ఉన్న ఏకైక కాలేజీ మాదే. ఇక్కడ చదువుతున్న విద్యార్థులు శతశాతం ఉద్యోగాలు పొందుతున్నారు. 2024–25లో 171 మందికి ఉద్యోగాలు లభించాయి. వీరికి ఇటీవల జాబ్ అచీవర్స్ డే నిర్వహించి నియామక పత్రాలు అందించాం. బాలికలు అత్యధిక వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలు సాధిస్తున్నారు. బాలికలకు కాలేజీ ప్రాంగణంలోనే అన్ని సదుపాయాలతో వసతి గృహం నిర్వహిస్తున్నాం.

– డాక్టర్ కె.వెంకటరమణ, ప్రిన్సిపాల్, గైస్, కంచరపాలెం

బైక్ కొనలేదని యువకుడి ఆత్మహత్య


గణేష్ మృతదేహం

మల్కాపురం: తన తండ్రి ద్విచక్ర వాహనం కొనివ్వలేదనే కారణంతో ఓ యువకుడు ఉరి వేసుకుని మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన జీవీఎంసీ 61వ వార్డులోని హరిజనవీధిలో చోటుచేసుకుంది. మల్కాపురం సీఐ విద్యాసాగర్ తెలిపిన వివరాలివి. వానపల్లి గణేష్(23) హెచ్‌పీసీఎల్‌లో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. రెండు వారాలుగా ద్విచక్ర వాహనం కొనివ్వమని తన తండ్రిని కోరుతున్నాడు. అయితే గణేష్ తండ్రి వానపల్లి అప్పలరాజు కూడా కాంట్రాక్ట్ కార్మికుడు. ద్విచక్ర వాహనం కొనిచ్చేంత డబ్బులు తన వద్ద లేవని, నువ్వు కూడా ఉద్యోగం చేస్తున్నందున ఈఎంఐ ద్వారా సొంతంగా వాహనం కొనుగోలు చేసుకోవాలని సూచించారు. ఇదిలా ఉండగా గణేష్ అన్నయ్యకు ఇది వరకే ద్విచక్ర వాహనం కొనిచ్చారు. తనను కొనమంటే లేదంటున్నారని గణేష్ మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో గణేష్ తన గదిలోకి వెళ్లి ఉరి వేసుకున్నాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, మార్గమధ్యలోనే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పలు రైళ్ల రద్దు, మరికొన్ని గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం : వాల్తేర్ డివిజన్ పరిధి పార్వతీపురం, సీతానగరం, బొబ్బిలి, డొంకినవలస సెక్షన్లలో మూడో లైన్ పనులు జరుగుతుండడంతో ఈ మార్గంలో నడిచే పలు రైళ్లు ఆయా తేదీల్లో రద్దు, మరికొన్ని గమ్యం కుదింపు, కొన్నింటిని రీషెడ్యూల్ చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు.

రద్దయిన రైళ్లు : ఈ నెల 22, 29, మే నెల 4వ తేదీన విశాఖపట్నం-కోరాపుట్-విశాఖపట్నం (58538/58537) పాసింజర్, ఈ నెల 22, 29, మే నెల 4వ తేదీన విశాఖ-రాయ్‌పూర్(58528) పాసింజర్, ఈ నెల 23,30, మే నెల 5వ తేదీన రాయ్‌పూర్-విశాఖ(58527) పాసింజర్, ఈ నెల 28వ తేదీన విశాఖ-కోరాపుట్(18512) బై వీక్లీ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 29వ తేదీన కోరాపుట్-విశాఖ (18511) బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దయ్యాయి.

గమ్యం కుదించిన రైళ్లు : ఈ నెల 21, 28, మే నెల 3వ తేదీల్లో గుంటూరు-రాయగడ(17243) ఎక్స్‌ప్రెస్ విజయనగరం వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 22, 29, మే నెల 4వ తేదీల్లో రాయగడ-గుంటూరు (17244) ఎక్స్‌ప్రెస్ రాయగడ నుంచి కాకుండా విజయనగరం నుంచి బయల్దేరుతుంది.

రీ షెడ్యూల్ చేసిన రైళ్లు

- ఈ నెల 22న ఉదయం 9.20 గంటలకు బయల్దేరాల్సిన విశాఖపట్నం-హజరత్‌నిజాముద్దీన్ (12807) సమతా ఎక్స్‌ప్రెస్ ఉదయం 10.50 గంటలకు బయల్దేరుతుంది.
- ఈ నెల 21న సాయంత్రం 4.30 గంటలకు బయల్దేరాల్సిన నాందేడ్-సంబల్‌పూర్(20810) నాగావళి ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 6 గంటలకు బయల్దేరుతుంది.
- ఈనెల 28న మధ్యాహ్నం 3 గంటలకు బయల్దేరాల్సిన బనారస్- విశాఖపట్నం(18524) ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 4 గంటలకు బయల్దేరుతుంది.

డ్యాన్సర్‌పై అత్యాచార కేసు నమోదు

సీతమ్మధార: డ్యాన్సర్ లోకేష్ ప్రేమపేరుతో తనను మోసం చేశాడని సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఫిర్యాదు మేరకు ద్వారకా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అనకాపల్లికి చెందిన లోకేష్ ఓ టీవీ చానల్ నిర్వహించిన డ్యాన్స్ షోలో పాల్గొనేందుకు హైదరాబాద్ వెళ్లాడు. అక్కడ ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని పరిచయమైంది. ఆ పరిచయం కాస్త ప్రేమగా మారింది. లోకేష్ పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగిక దాడికి పాల్పడ్డాడని.. పెళ్లి చేసుకోవాలని అడిగితే ముఖం చాటేశాడని ఆమె కొద్దిరోజుల క్రితం ద్వారకా పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు లోకేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అతడికి కండిషన్ బెయిల్ మంజూరైంది.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

- వాటిని కొనుగోలు చేసిన మరో ఇద్దరు అదుపులో..
- విశాఖ, విజయనగరం ప్రాంతాల్లో చోరీ చేసిన 20 బైక్‌ల స్వాధీనం


స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలతో క్రైం డీసీపీ లతామాధురి, అధికారులు, సిబ్బంది

పెందుర్తి: ఒకటి కాదు రెండు కాదు ఏడాది కాలంలో ఏకంగా 20 బైక్‌లు అపహరించాడో ఘనుడు. విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో ఇళ్లు, షాపింగ్ మాళ్లు తదితర ప్రాంతాల్లో పార్కింగ్ చేసిన బైక్‌లపై అతడి కన్ను పడితే మాయం కావాల్సిందే. అలాంటి బైక్‌ల దొంగ ఆటకట్టించారు పోలీసులు. అతడు దొంగిలించిన బైక్‌లను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు. ఆయా బైక్‌లను కొనుగోలు చేసిన వారి(రిసీవర్‌లు)పై కూడా కేసులు నమోదు చేసి వారినీ అరెస్ట్ చేశారు. పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నగర క్రైం విభాగం డీసీపీ కె.లతామాధురి ఆయా వివరాలను వెల్లడించారు. పెందుర్తి అయ్యప్పకాలనీ(జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం)లో నివాసం ఉంటున్న అంపోలు కిషోర్‌కుమార్ అలియాస్ ధోనాభాయ్ పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను దొంగిలించడంలో దిట్ట. ఈ క్రమంలో 2023 నుంచి 2025 వరకు విశాఖపట్నం, విజయనగరం ప్రాంతాల్లో మొత్తం 20 ద్విచక్ర వాహనాలను చాకచక్యంగా అపహరించుకుపోయాడు. ఇటీవలే పెందుర్తిలో ఓ వ్యక్తి తన ఇంటి ముందు బైక్‌ను పార్కింగ్ చేయగా కిషోర్‌కుమార్ దొంగిలించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పెందుర్తి క్రైం పోలీసులు దర్యాప్తు చేపట్టి, నిందితుడ్ని చాకచక్యంగా పట్టుకున్నట్లు డీసీపీ వెల్లడించారు. ఆయా ప్రాంతాల్లో అతడు చోరికి పాల్పడిన రూ.12 లక్షల విలువైన 20 బైక్‌లను స్వాధీనం చేసుకుని నిందితుడ్ని అరెస్ట్ చేశామన్నారు. అతడితో పాటు రిసీవర్‌లు ఒడిశా రాష్ట్రం రాయగడ జిల్లా జిమిడిపేటకు చెందిన కందగిరి కాబ్బు, అదే జిల్లా ఆనందపూర్ గ్రామానికి చెందిన మహానందీయా నరేంద్రను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుడు కిషోర్‌కుమార్‌పై గతంలో మోటార్‌సైకిల్ దొంగతనాలు, చైన్ స్నాచింగ్ కేసులు ఉన్నాయని, 10 నెలల జైలు శిక్ష అనుభవించాడని వెల్లడించారు. బైక్‌ల దొంగను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన వెస్ట్ జోన్ సీఐ ఎస్.శ్రీనివాసరావు, పెందుర్తి ఎస్ఐ డి.సూరిబాబు, ఏఎస్ఐ మూర్తి, హెచ్‌సీ జి.నాగరాజు, పీసీలు టి.శివప్రసాద్, బి.దేముడునాయుడు, ఎల్.కె.తాతారావు, ఎల్.సింహాచలంనాయుడు, పీసీహెచ్ పైడిరాజు, వి.విజయ్‌కుమార్, జి.శ్రీనివాసరావులను ప్రత్యేకంగా అభినందించారు.

స్టీల్‌ప్లాంట్‌లో తప్పిన ప్రమాదం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కోక్ ఓవెన్స్ విభాగం సమీపంలో డంపర్.. పైపులైన్ స్ట్రక్చర్‌ను ఢీకొట్టింది. అదృష్టవశాత్తు పైపులైన్‌కు ఎటువంటి నష్టం వాటిల్లలేదు. ప్రత్యక్షసాక్షుల కథనం మేరకు వివరాలివి.. స్టీల్‌ప్లాంట్ ఫీల్డ్ మిషనరీ విభాగం (ఎఫ్ఎండీ)నకు చెందిన డంపర్ నుంచి మెటీరియల్‌ను హైడ్రాలిక్ అన్‌లోడింగ్ చేసి.. బాడీ దించకుండా బయలుదేరింది. విభాగం సీసీపీ వద్దకు వచ్చేసరికి పైపులైన్ స్ట్రక్చర్‌ను డంపర్ బాడీ ఢీకొట్టింది. ఈ ఘటనలో డంపర్ ముందు భాగం గాలిలోకి లేచిపోయింది. వెంటనే విభాగం సిబ్బంది అక్కడకు చేరుకుని డంపర్ బాడీని కిందకు దించారు. ఈ సంఘటనలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.


స్ట్రక్చర్‌కు తగిలి పైకి లేచిన డంపర్ ముందు భాగం

క్రికెట్ జట్టు ఎంపికలో క్లబ్ ఆటగాళ్లకే అవకాశమా?

వీడీసీఏ అపెక్స్ కమిటీ తీరుపై ఔత్సాహిక క్రికెటర్ల ఆరోపణలు

విశాఖ స్పోర్ట్స్: క్రికెట్ జట్టు ఎంపిక ప్రక్రియను క్లబ్ ఆటగాళ్లకే పరిమితం చేయడం సరికాదని, బయటవాళ్లను అనర్హులుగా పేర్కొనడాన్ని ఫస్ట్‌క్లాస్ క్రికెటర్ ఎస్‌కే హుస్సేన్, కొందరు ఔత్సాహిక క్రికెటర్లు ఆక్షేపించారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత ఆదివారం వీడీసీఏ బి గ్రౌండ్‌లో సీనియర్స్ జట్టు ఎంపిక జరిగిందని, వాటిలో పాల్గొనేందుకు అర్హత కల్పించలేదని ఆరోపించారు. ఎంపిక ప్రక్రియను క్లబ్ ఆటగాళ్లకే పరిమితం చేస్తూ, కొందరు ఆటగాళ్లకు అర్హత లేకున్నా అనుమతి ఇవ్వడాన్ని ఆక్షేపించారు. ప్రస్తుత వీడీసీఏ అపెక్స్ కమిటీకి కొనసాగే అర్హత లేదంటూ కోర్ట్ కేస్ నడుస్తోందని, అలాంటి వారే ఎంపిక కమిటీలో ఉంటే పారదర్శకతకు చోటేదన్నారు. తమకు బి గ్రౌండ్‌లో ప్రాక్టీస్ చేసుకునేందుకు అవకాశం కల్పించక పోవడంతో బయట అకాడమీల్లో వ్యయప్రయాసలకు ఓర్చి శిక్షణ పొంది, ట్రయల్స్‌లో అవకాశం కోసం ఎదురుచూస్తుంటే తమను అంగీకరించకపోవడం సరికాదన్నారు. దీనిపై విశాఖ జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి పార్థసారథిని సాక్షి వివరణ కోరగా అండర్ 16, 18లో మూడేళ్ల నుంచి ఆడిన వారికే సీనియర్స్(–23) జట్టులో అవకాశం కల్పిస్తామన్నారు. ఇలా ఆడినవారే 60 మంది తాజా సెలక్షన్స్‌కు హాజరైనట్లు తెలిపారు. ఇంకా ఎంపిక ప్రక్రియ పూర్తికాలేదని, రానున్న శని, ఆదివారాల్లో ప్రక్రియ పూర్తిచేసి సోమవారం జట్టు ఎంపికపై సెలక్షన్ కమిటీ నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఎంపిక ప్రక్రియకు సంఘానికి సంబంధం ఉండదని, అదంతా సెలక్షన్ కమిటీ చూసుకుంటుందన్నారు. రాష్ట్రంలో విశాఖ జిల్లానే ఎటువంటి సిఫార్సులకు తలొగ్గకుండా ఎంపికలు చేస్తోందని స్పష్టం చేశారు.

పేలుడు బాధితుల్లో ఇద్దరి పరిస్థితి విషమం

వెంటిలేటర్‌పై చికిత్స

మహారాణిపేట: కోటవురట్ల మండలం కైలాసపట్నంలో జరిగిన బాణసంచా ప్రమాదంలో గాయాలైన ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. కేజీహెచ్ సీఎస్సార్ బ్లాక్‌లో జెల్లూరి నాగరాజుకు, మెడికవర్ ఆస్పత్రిలో మడగల జానకీరామ్‌కు వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. కాగా వేలంగి సంతోషి, వేలంగి షారోణి, వేలంగి రాజు కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ ముగ్గురిని త్వరలో డిశ్చార్జ్ చేస్తారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఇంకో క్షతగ్రాతుడు సియ్యాదుల గోవింద్ కేజీహెచ్ ప్లాస్టిక్ సర్జరీ వార్డులో చికిత్స పొందుతున్నాడు.

బాలికతో ఇంటి యజమాని అసభ్య ప్రవర్తన

పోక్సో కేసు నమోదు

మల్కాపురం: బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఇంటి యజమానిపై మల్కాపురం పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలివి.. జీవీఎంసీ 60వ వార్డు బర్మాకాలనీలో అంగ కృష్ణకు గ్రూప్‌హౌస్ ఉంది. తన కుటుంబ సభ్యులతో కలిసి గ్రౌండ్ ఫ్లోర్‌లో నివాసం ఉంటున్నాడు. మొదటి అంతస్తులో 12 ఏళ్ల వయసున్న బాలిక, ఆమె తల్లిదండ్రులు పదేళ్ల నుంచి అద్దెకు ఉంటున్నారు. బాలిక తండ్రి కారు డ్రైవర్, తల్లి ఓ షాపింగ్ మాల్‌లో పని చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. ఇదిలా ఉండగా.. సోమవారం రాత్రి 8.45 గంటల సమయంలో ఇంట్లో బాలిక ఒంటరిగా ఉంది. ఇది గమనించిన కృష్ణ గదిలో పైపు మరమ్మతు ఉందని ఇంట్లోకి ప్రవేశించాడు. ఆ బాలికతో మాటామాట కలిపి.. ఆమె శారీరాన్ని తాకడం, అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో ఆ బాలిక తప్పించుకునేందుకు ప్రయత్నిస్తుండగా.. అదే సమయంలో ఆమె తండ్రి ఇంటికి వచ్చాడు. జరిగిన విషయాన్ని తన తండ్రికి చెప్పడంతో.. అతను మల్కాపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారించిన సీఐ విద్యాసాగర్.. నిందితుడు కృష్ణపై పోక్సో కేసు నమోదు చేశారు.

సముద్రారెడ్డికి కేంబ్రిడ్జ్ డిజిటల్ యూనివర్సిటీ డాక్టరేట్


డాక్టరేట్‌ను అందుకుంటున్న కర్రి సముద్రారెడ్డి

విశాఖ సిటీ: వైకుంఠగిరి ధర్మకర్త కర్రి సముద్రారెడ్డికి కేం బ్రిడ్జ్ డిజిటల్ యూనివర్సిటీ డాక్టరేట్ లభించింది. ఏటా భారతదేశంలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచి, విశిష్ట సేవలు అందించిన వ్యక్తులకు ఇచ్చే ఈ డాక్టరేట్ పురస్కారాన్ని ఆధ్యాత్మిక రంగంలో కాశీపట్నంలో వైకుంఠగిరి అనంత వేంకటేశ్వర స్వామి దేవాలయాన్ని నిర్మించిన సముద్రారెడ్డికి మంగళవారం ఢిల్లీలో ప్రధానం చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన హై కమిషనర్ లూయిస్ ఓబంగ్, పాలస్తీనా ఎంబసీ కౌన్సిలర్ బాసెమ్ ఎఫ్ హెలీస్, బాలీవుడ్ హీరో రాహుల్ రాయ్ సమక్షంలో ఈ డాక్టరేట్‌ను అందించారు. సుమారు 4 వేల అడుగుల ఎత్తున కొండపై వైకుంఠగిరి లాంటి పెద్ద క్షేత్రాన్ని నిర్మించడం గొప్పవిషయమని అతిథులు ప్రశంసించారు. అరణ్య ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు లేని చోట 18 కిలోమీటర్ల ఘాట్ రోడ్డు నిర్మాణం చేపట్టడం సాహసోపేతమైనదని కొనియాడారు.